తెలుసు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు తెలియటానికి నీచేత సాధన చేయిస్తాడు, నీ మీద దయ చూపిస్తాడు, తలుపుసందున పెట్టి నొక్కినట్లుగా నిన్ను నొక్కుతాడు, కంగారు పడవద్దు. ఆయన ఆగ్రహం కూడా అనుగ్రహమే అని నీవు అర్థం చేసుకోవాలి. నువ్వు ఇతరులకు ఏదైనా ఇచ్చావు అనుకో అది తిరిగి నీకు వచ్చేస్తుంది అంటారు భగవాన్. ఆ విషయం నీకు తెలియక నేను ఇతరులకు ఇచ్చాను అనుకొంటావు. ఇవ్వటానికి ఎవరు ఉన్నారు? ఉన్నది ఒక్కటే. ఈ ఇవ్వటాలు, పుచ్చుకోవటాలు అన్నీ కూడా మనోగతాలు, దేహగతాలు, అహంకారగతాలు. అసలు వస్తువుకు దీనికి ఎటువంటి సంబంధంలేదు. అసలు వస్తువుకు అది తప్పించి ఏదీ లేదు. ద్వితీయమే లేదు. అసలువస్తువు నీ హృదయంలో ఉంది. దానిని సిద్ధింపచేసుకో. స్వామిదర్శనానికి వెళ్ళినప్పుడు కోరికలు కోరుతున్నారు. దానివలన మీ కోరికలు నెరవేరవచ్చు. ఇది అంతా తాత్కాలికం. ఇవి అన్నీ కాలాప్రవాహంలో కొట్టుకొని పోతాయి. అందుచేత స్వామి దగ్గరకు వెళ్ళినప్పుడు ఏదో కోరుకోవటం కాదు ఆయననే కోరుకోండి, జ్ఞానాన్ని కోరుకోండి.

2A

## రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 8-09-2002, ఆకివీడు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పనిచేయండి, కర్తృత్వం లేకుండా పనిచేయండి నేను అనే తలంపు లేకుండా పనిచేయండి అని భగవాన్ చెపుతున్నారు. శరీరం వస్తే ఆ శరీరం ఏ పని నిమిత్తం ఈ భూమి మీదకు వచ్చిందో నీవు కర్తను అనుకొన్నా, నీవు కర్తను అనుకోకపోయినా ఆ పని నీ శరీరం ద్వారా జరుగుతుంది. దేహం యొక్క ప్రారబ్దం ననుసరించి ఆదేహం పనిచేసి మరణిస్తుంది. ఆదేహం ద్వారా జరిగే పనితో నీవు తాదాప్యం పొందవద్దు. అన్ని లాభముల లోనికి ఆత్మలాభం గొప్పది, అన్ని సుఖాలలోనికి ఆత్మసుఖం గొప్పది. అటువంటి ఆత్మలాభాన్ని పొందటానికి ప్రయత్నం చెయ్యి అని భగవంతుడు చెప్పాడు. సబ్జక్టు సరిగా అర్థమయితే అన్ని లాభములలోనికిగొప్పది అయిన ఆత్మలాభమును ఈ భూమి మీద ఉండగానే పొందుతారు. దేహప్రారబ్దమును బట్టి సన్మానములు, అవమానములు వస్తూ ఉంటాయి. ఒకోసారి పరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటాయి, ఒకోసారి ప్రతికూలంగా ఉంటాయి,



ఇది నగ్నసత్యంకాదు, ఇవి అన్నీ వ్యవహారిక సత్యములు మాత్రమే. రెండు విషయాలు జీవితం పొడుగునా గుర్తుపెట్టుకోండి. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు గర్వం రాకుండా చూసుకోండి, పరిస్థితులు వ్యతిరేఖంగా ఉన్నప్పుడు బాధ రాకుండా చూసుకోండి. ప్రారబ్దమును బట్టి ఒకోసారి అదృష్టం, ఒకోసారి దురదృష్టం వెంటాడతాయి. అదృష్టం వెంటాడినప్పుడు గర్వం తెచ్చుకోవద్దు, దురదృష్టం వెంటాడినప్పుడు నిస్పృహ రాకుండాచూసుకోండి, బాధ రాకుండా చూసుకోండి. మీకు గర్వం వచ్చినా, బాధ వచ్చినా ఆత్మజ్ఞాన సముపార్జనకు మీరు నడిచే మార్గం తప్పిపోతారు. మనస్సుకు పొంగువచ్చినా కృంగువచ్చినా మీరు గమ్యాన్ని చేరుకోలేరు సరికదా గమ్యాన్ని మర్చిపోతారు. ఇది దృష్టిలో పెట్టుకోండి. ఏ మనిషిని మానవజాతి ఎక్కువగా గౌరవిస్తుంది అంటే వాడికి డబ్బు ఉన్నా విద్య ఉన్నా వాడిని గౌరవించరు, ఎవడైతే సర్వకాల సర్వావస్థలలో గర్వంలేకుండా ఉంటాడో వాడినే సమాజం గౌరవిస్తుంది అని భారతంలోచెప్పారు. శరీరం ఏ పని నిమిత్తం వచ్చిందో ఆ పని ఆ శరీరం ద్వారా జరుగుతుంది. అందువలన ఇది నేను చేస్తున్నాను అని కర్తృత్వ భావన పెట్టుకోవద్దు. పని విడిచిపెట్టవద్దు నేను చేస్తున్నాను అనే భావనను విడిచిపెట్టు. దేహం ద్వారా ఒక పని జరుగుతూ ఉంటే అది భగవంతుడు ఇచ్చిన ఒక అవకాశం అనుకొని పనిచెయ్యాలి.

నేనునేను అని చెప్పేది దేహం కాదు, లోపల ఉన్న ఆత్మ కాదు, వీటికి మధ్యలో ఉన్న అహంభావనే నేను, నేను అంటోంది. ఈ అహంభావనకు మేత ఏమిటి అంటే రూపచింతన, నామచింతన. జాగ్రదవస్థలో ఉండగా ఏదో రూపాన్ని, నామాన్ని చింతించకుండా మీలో ఎవరైనా ఉన్నారా? ఆ రూపచింతన, నామచింతనే మీ అహంభావనకు ఆహారం సప్లయి చేస్తున్నాయి. అహంభావనకు ఉపాధి ఈ శరీరం. అది ఎప్పుడూ ఏదో రూపాన్ని నామాన్ని పట్టుకొని ఉంటుంది. రూపాలను, నామాలను మారుస్తుంది. ఈ అహంభావనను మీరు దేవుడు అనుకొంటున్నారు. అది దేవుడు కాదు, అది దెయ్యం. అది దెయ్యం అన్న సంగతి మీకు తెలియటం లేదు, మీరు దారితప్పిపోతున్నారు. అహంకారాన్ని నాశనం చేయటమే మీ జీవితగమ్యం. అహంకారం నశించకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు, ఆత్మశాంతి కలుగదు.

అహంకారం నశించాలంటే నిరంతరం ఆత్మను చింతించు. అన్యచింతలు కొంచెం కూడా నీ మనస్సు లోనికి రాకుండా చూసుకో. అదే సాదన అని భగవంతుడు చెప్పాడు. అహంభావన దెయ్యం అని మీకు తెలియకపోవటం ఒక పొరపాటు, అంతేకాదు దానిని

దేవుడు అనుకొంటున్నారు ప్రమాదాలలో పడుతున్నారు. అందువలన మీకు సరియైన అవగాహన ముఖ్యం.

అందరికి దేవుడు కారణం అని చెపుతున్నారు మరి దేవుడికి ఎవరు కారణం అని అడుగుతున్నారు. నాకు ఆదిలేదు, అంతంలేదు. నేను కారణరహితుడను, నాకు కారణం అంటూలేదు, లోకమహేశ్వరం ఈ లోకాలనుపాలించే వాడినినేను, యజమానిని నేను అందరిని నియమించేవాడినినేను అని భగవంతుడే చెపుతున్నాడు. నేను కారణం లేని వాడిని నాకు పుట్టుకలేదు, మరణంలేదు, ఈ లోకాలకు అన్నింటిని యజమానిని నేను అని ఏ బుద్ధిమంతుడు అయితే గ్రహిస్తున్నాడో వాడు మోహరహితుడు అవుతాడు, వాడి బుద్ధిలో ఏమైనా దోషాలు ఉంటే ఆ దోషాలనుండి విడుదల పొందుతాడు, మోక్షం వాడకి అనుగ్రహించ బడుతుంది, నా స్వరూపాన్ని పొందుతాడు అని పరమాత్మ చెపుతున్నాడు. ఆయన స్వరూపమే శాంతి, ఆయన స్వరూపమే ఆనందం, ఆయన స్వరూపమే ఉండటం, తపస్సు లేని వారికి, జిజ్ఞాస లేనివారికి, బుద్ధిమంతులు కానివారికి, అహంభావపూరితులకు ఈ శాస్త్రం చెప్పవద్దు అని గీతలో భగవంతుడు చెప్పాడు. కారణం ఏమిటి అంటే అటువంటి వారు భగవంతుడు ఏదో చెప్పాడు, ఇది నిజమా అనుకొంటూ ఉంటారు, అటువంటి వారికి శాస్త్రం చెప్పటం ఎందుకన్నాడు. కొంతమందికి వారి అహంకారం ఏది చెపితే అదే శాస్త్రం అహంకారాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తారు. కాని బుద్ధిమంతులు శాస్త్రంలో చెప్పినది ప్రమాణంగా పెట్టుకొంటారు, అటువంటి వారికి ఈ శాస్త్రం చెప్పు అని చెప్పాడు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను, జీవకోటిని వారిప్రారబ్దం ననుసరించి నియమిస్తున్నాను అని భగవంతుడు చెపుతున్నాడు. కాని మీకు తపస్సులేక పోవటం వలన ఇది అర్థం కావటంలేదు. మనందరం జీవులము. మనందరము అనేకరకాలుగా అనుకొంటాము. మనం అనుకొన్నట్లుగా ప్రపంచం నడవదు. ఈశ్వరాజ్ఞననుసరించి ఈ ప్రపంచం నడుస్తుంది. ఈ లోకానికి ప్రభువు ఆయనే. దేహంపొంగిపోదు, లోపల ఉన్న ఆత్మ పొంగిపోదు. నిన్ను ఎవరైనా పొగిడితే అహంభావన పొంగిపోతుంది, నిన్నుఎవరైనా విమర్శిస్తే అహంభావన కృంగిపోతుంది. నీవు దేనినైతే తొలగించుకోవాలో దాని మొదలులో నీరుపోయకు, ఇది గ్రహించు. అహంభావనే మీరు అనుకొంటున్నారు. కాని అది మీరు కాదు. దానిని విచారణ చేస్తే అది పత్తాలేకుండా పోతుంది. మీరు విచారణ చేయటంలేదు, విచారణ ప్రారంభించండి. అహంభావన యొక్కమూలం నీ లోపలే ఉంది. అహంభావన యొక్క మూలం బడిలోలేదు, గుడిలోలేదు, బయట ఎక్కడా లేదు నీలోపలే ఉంది. మూలతలంపు యొక్క మూలం





నీలోపలే ఉంది. అక్కడే భగవంతుడు ఉన్నాడు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి అభ్యాసం, వైరాగ్యం అవసరమని భగవంతుడు చెప్పాడు. మీకు డబ్బు విలువ, చదువు విలువ తెలుస్తోంది వాటిని సంపాదించుకొంటున్నారు, కాని అభ్యాసం విలువ, వైరాగ్యం విలువ మీకు తెలియటంలేదు. అందువలన మీకు అభ్యాసం లేదు, వైరాగ్యం లేదు. అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా మూలతలంపు మూలంలోనికి మనం దిగలేము.

దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. కర్తలేని కర్మ చేయండి. అదే కర్మయోగం. కర్మఫలంనందు సంయోగం పెట్టుకోవద్దు. కర్మఫలాన్ని ఆశిస్తే శరీరం వచ్చి తీరుతుంది ఎవరూ ఆపుచేయలేరు. కోరికతో కర్మను చేయటం వలన వాసనలు వస్తాయి, అవే పునర్జన్మను తీసుకొని వస్తాయి. సమాన బుద్ధి కలిగి ఉండాలి. వారు ఎక్కువ, వీరు తక్కువ అని అహంభావన కల్పిస్తోంది. అంతా సమానమే అది మనకు తెలియక అహంభావన కల్పించేది నిజం అని మనం అనుకొంటున్నాము. భగవంతుడికి కులంలేదు, మతంలేదు, భగవంతుడు స్త్రీ కాదు, పురుషుడు కాదు ఆయనకు గుణాలు లేవు కాని భగవంతుడు ఫలనా కులం వాడు అని ఏదో గుణం ఉందని, ఆయన పురుషుడు అని ఇలా లేని పోని గొడవలు అన్నీ ఆయనకు అంటగట్టేది ఈ అహంభావనే. అహంభావన నశించాలంటే దానికి నీ సాధన సరిపోదు, నీ తెలివి సరిపోదు, గురువు అనుగ్రహం లేకుండా అది నశించదు. కొంతమంది వారి స్వార్థం కోసం పనిచేస్తూ మేము కర్మయోగులము అంటారు. భగవంతుడు కర్మకు ప్రాముఖ్యత ఇచ్చాడు, ఆయన చెప్పినది కర్తలేని కర్మచేయమని చెప్పాడు. అంటే అహంభావన లేని కర్మ చేయమని చెప్పాడు. అలా చేస్తే కర్మ నిన్ను బంధించదు. సన్యాసం అంటే అహంభావనను విడిచి పెట్టటమే సన్యాసం. మీరు ఏ బట్టలు కట్టుకొన్నా ఎర్రబట్టలు అయినా, తెల్ల బట్టలు అయినా కర్మఫలం ఆశించకుండా కర్మ చేస్తే మీరు కూడా సన్యాసులతో సమానము.

జీవన్ముక్తుడు అంటే ఈ శరీరానికి మరణం రాకముందే లోపల ఉన్న ఆత్మసుఖాన్ని వాడు పొందాలి. జీవన్ముక్తుడు అయిన తరువాత కూడా వాడు పనిచేయాలా అని అడుగుతున్నాడు. నీవు జీవన్ముక్తుడవు కావు కదా ఇప్పుడు ఆ ప్రశ్న ఎందుకు? ముందు జీవన్ముక్తుడవు అవ్వు. జీవన్ముక్తుడవు అయిన తరువాత ఆ ప్రశ్న అవసరమైతే అప్పుడు అడగవచ్చు, ఇప్పుడు దాని గొడవ ఎందుకు? నీ స్థితిని అర్థం చేసుకో. జీవన్ముక్త స్థితి ఎలా ఉంటుంది అని ముందు ఊహించుకోవటం ఎందుకు. నీలో కామక్రోధములు ఉన్నాయి,

ముందు వాటిలో నుండి విడుదల పొందు. ఒక శిష్యుడు గురువుగారితో నాకు తరచుగా కోపం వస్తోంది, ఆ కోపాన్ని తొలగించమని అడుగుతున్నాడు. అప్పుడు గురువుగారు ఆ కోపాన్ని నాకు చూపించు అన్నారు. నిన్న ఉంది, ఇప్పుడు లేదు అంటున్నాడు శిష్యుడు. ఒకప్పుడు ఉండి, ఇంకొకప్పుడు లేనిది నిజం ఎలా అవుతుంది. అది నీవు ఎలా అవుతావు అంటున్నారు గురువుగారు. కోరిక, కోపం నీకు నిద్రలో ఉన్నాయా అని అడిగారు. లేవు అని చెప్పాడు. కాని జాగ్రదవస్థలో వస్తున్నాయి. నిద్రలో ఉన్నవాడు, ఇప్పుడు ఉన్నవాడు ఒక్కటేనే అని అడిగారు. ఒక్కటే కాని నీకు నిద్రలో కోరిక కోపం లేదు ఇప్పుడు వస్తున్నాయి. కోరిక, కోపం నిజంకాదు, అవి నీవు కాదు. నీవు కానివి నీలోపలకు వస్తూ ఉంటే ఎందుకు రానిస్తున్నావు? కోరిక, కోపం మంచివి కాదు, అవి నీకు అశాంతిని తీసుకొని వస్తున్నాయి. మరి ఎందుకు వాటిని లోపలకు రానిస్తున్నావు? అవి రాకుండా చూసుకో, నీవు చేయవలసిన సాధన అదే. నీ ప్రవర్తనలో గాని, నీ జీవిత విధానంలో గాని కోరిక కోపం కలుగజేసుకోకుండా చూసుకో. అవే నీ పునర్జన్మకు కారణం. ఏవైతే నీ పునర్జన్మకు కారణమో వాటిని ఎందుకు లోపలకు రానిస్తున్నావు. అవి రాకుండా చూసుకో సరిపోతుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది.

నీవు నాతో మాట్లాడుతున్నావు కదా, ఆ మాట్లాడేది ఎవరు? దేహం, మనస్సు కలిసిన మనిషి మాట్లాడుతున్నాడు. దేహం లేకుండా ఎప్పుడైనా ఉన్నావా అని అడుగుతున్నారు. దేహం లేకుండా ఎప్పుడూలేను అని చెపుతున్నాడు. మరి గాఢనిద్రమాట ఏమిటి? గాఢ నిద్రలో నీవు ఉన్నావా? లేదా? నీవు ఉన్నావు. గాఢనిద్రలో దేహం లేకుండా మనస్సు లేకుండా, కోరికలు లేకుండా ఉంటున్నావు కదా. గాఢ నిద్రలో ఉన్న స్థితే నిజమైన స్థితి. అది సహజ స్థితి. నీ మనస్సు కల్పించేది అంతా అసహజం. ఏ తలంపు వచ్చినా అది సహజం కాదు, అది ఒక ఉద్రేకం. నీకు ఇష్టం వచ్చినా, అయిష్టం వచ్చినా ఏ తలంపు వచ్చినా అవి అన్నీ ఉద్రేకాలు. ఎదుటివారు ఎటువంటివారు అనేది నీకు అనవసరం. నీవు ధర్మాన్ని ఆచరించు. నీ ప్రవర్తన తీర్చి దిద్దుకో. ధర్మాన్ని ఆచరించటం వలన నీకు భగవంతుడితో అనుబంధం ఏర్పడుతుంది. భగవంతుడితో అనుబంధం ఏర్పడితే అప్పుడు నిజమైన మౌనం వస్తుంది. భగవంతుడితో అనుబంధం ఏర్పడితే అది కొత్తగా ఉండదు. ఏనాటి అనుబంధమో ఇది అనే స్మృతి నీకు కలుగుతుంది. ఏనాటిదో ఇది మర్చిపోయాము, ఇప్పుడు మరల గుర్తు చేసుకొంటున్నాము అనిపిస్తుంది. ఎవడికైతే నిష్కామబుద్ధి ఉందో ఎవడికైతే సహజబుద్ధి ఉందో, ఎవడికైతే సమానబుద్ధి ఉందో, ఎవడిలో అయితే హెచ్చు తగ్గులు లేవో వాడిలో ఉన్నపుణ్యాలు, పాపాలు అవి వాడు తెలిసిచేసిన, తెలియక చేసినా అవి అన్నీ కూడా వాడికి అనుభవంలోనికి రాకుండా పోతాయి, ఈ జన్మలోనే వాడు నా స్వరూపాన్ని పొందుతాడు అని భగవంతుడు చెపుతున్నాడు. నీవు చేతితో ఏ పనిచేస్తున్నా, మనస్సులో ఏది ఆలోచిస్తున్నా ఆత్మను పొందటానికి అది నీకు సహకరించాలి, అదే వివేకవంతమైన పని, అప్పుడు నీవు బుద్ధిమంతుడవుఅవుతావు. నాలుగుగోడల మధ్యన కూర్చొని, దేవుని పఠం పెట్టుకొని ధ్యానం చేస్తున్నాము అంటే ధ్యానం చేయటం వలన విక్షేపం నశించాలి. నీ మనస్సు కదిలితే ప్రపంచం, కదలని మనస్సుకు ప్రపంచంలేదు. నీకువిక్షేపదోషంఉంటే లోకం ఉంది, విక్షేపదోషం లేకపోతే లోకం లేదు. ధ్యానం చేసి విక్షేపదోషాన్ని పోగొట్టుకోవాలి. ధ్యానం చేయటం వలన ఏ ఫలితం వస్తుంది అని అనుకొంటున్నావో స్వార్థం లేకుండా చేసే పని వలన కూడా అదే ఫలితం వస్తుంది అని గ్రహించు. అజ్ఞానంలో ఉన్నవారు రకరకాలుగా చెపుతారు, ఆ పనిచేస్తే ఈ పుణ్యం వస్తుంది అని రకరకాలుగా చెపుతారు, ఆ మాటలకు వ్యామోహం పొందవద్దు. ఆ మాటలలో కొట్టుకొని పోవద్దు. ఊహలలో జీవించవద్దు, వర్తమానకాలంలో జీవించు, సుఖం వచ్చిన, కష్టం వచ్చినా అంతా భగవంతుడి ప్రసాదమే. నీకు అధిపతి మాయ, మాయకు అధిపతి లోకేశ్వరుడు. మాయకు అధిపతి అయిన లోకేశ్వరుడికి శరణాగతి పొందు, మాయవిడిచి పెడుతుంది, ఆయన స్వరూపం నీకు తెలుస్తుంది. భగవంతుడు చెప్పిన మాటలను ఉన్నది ఉన్నట్లుగా అర్థంచేసుకొంటే అజ్ఞానంలోనుండి విడుదల పొందుతాము. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టండి. మన గురి అంతా అజ్ఞాన నాశనం మీద పెట్టాలి.

జీవితంలో అన్నీ తాత్కాలికములే, నీ శరీరం తాత్కాలికం నీకుఅదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా, కష్టం వచ్చినా, సుఖం వచ్చినా, గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా అన్నీ తాత్కాలికములే, అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి. ఒక్క భగవంతుడు తప్పించి ఏదీ సత్యం కాదు. కాల ప్రవాహంలో నీ శరీరమే కొట్టుకొని పోతుంది.

ఇంక నీ అదృష్టం ఎంతసేపు ఉంటుంది, దురదృష్టం ఎంతసేపు ఉంటుంది. ఇవాళ పచ్చగా ఉండి, రేపు ఎండిపోయే వస్తువులను కాదు నీవు పొందవలసింది, శాశ్వతంగా ఉండే వస్తువు కోసం ప్రయత్నించు.

దేహ ప్రారబ్దంలో ఉన్నది ఏదో వస్తుంది, లేనిది ఏదో రాదు, లేని దానికోసం నీవు ప్రయత్నం చేసినా అది రాదు. బ్రహ్మం అంతటా వ్యాపించి ఉంది, అదే సత్యం, అది

అనుభవంలోనికి రావాలి. దాని స్వరూపమే జ్ఞానం. దాని స్వరూమే శాంతి, దాని స్వరూపమే ఉండటం. జీవుడు రెండు పొరపాట్లు చేస్తున్నాడు. 1. దేహము వాడు కాకపోయినా ఈ దేహాన్ని నేను, ఈ దేహాన్నినేను అని చనిపోయేవరకు అదేగోల. 2. లోకంలో సుఖంలేకపోయినా ఏ జన్మకు ఆజన్మ సుఖం కోసం లోకంలో వెతుక్కొంటున్నాము. ఇలా వేలాది జన్మల నుండి ప్రతీ జన్మలోనూ ఈ తప్పులు చేస్తున్నాము. గాఢ నిద్రలోనీవు దేహంలో విడిపోతున్నావు ఎందుచేతనంటే అది నీవు కాదు కాబట్టి విడిపోతున్నావు. మరి రోజూ దేహము నేను అనే గోల ఏమిటి? దేని నుండి అయితే విడుదల పొందాలో దానినే పెంచుకోవటం. మనం ఎప్పుడైనా సత్కర్మ చేసి ఉంటే, ఎవరిక్షేమం అయినా కోరుతూ ఉంటే మనకు మంచిబుద్ధి కలుగుతుంది. మనం ఎంతసేపు దేహాన్ని కేంద్రంగాపెట్టుకొని జీవిస్తున్నాము ఇంక మనకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. ఏదైతే మనం కాదో అదే మనం అనుకొంటున్నాము. ఎక్కడ ఆనందం లేదో అక్కడ ఆనందం కోసం వెతుకుచున్నాము. ఏదో గురువు అనుగ్రహం వలన ఈ పొరపాట్లనుండి విడుదల పొందాలి గాని దీనికి మన తెలివిసరిపోదు, మన సాధన సరిపోదు.

భగవాన్ కిచెన్‌లో ఉండి కూరగాయలు కోసేవారు. ఆ ప్రక్కపని చేసేవారు ఏదో ఇక్కడ కూరలు కోస్తున్నాము కొంతమంది హాలులో కూర్చొని ధ్యానం చేసుకొంటున్నారు. ఆ అదృష్టం మాకు లేదు అనేవారు. సాక్షాత్తూ భగవంతుడే ప్రక్కన కూర్చొని పనిచూస్తూ ఉంటే ఆ ఫలితం కంటే ధ్యానం చేసేవారికి ఎక్కువ వస్తుంది అనుకోవటం, భగవంతుడు ప్రక్కన ఉన్నాడు అన్నది వదిలేసి ఎక్కడో ధ్యానం చేసేవారి గురించి ఆలోచించటం వారికి ప్రక్కన ఉన్నవాడు భగవంతుడే అనే గుర్తింపు పోయింది. శరీరం పడుతుంది, శరీరం మరణిస్తుంది. శరీరానికి సంబంధించిన, మనస్సుకు సంబంధించిన వికారములు బ్రహ్మంకు లేవు. ఏ వస్తువుకయితే వికారం లేదో, ఏ వస్తువుకయితే రంగు లేదో, ఏ వస్తువుకయితే గుణం లేదో ఏ వస్తువుకయితే చావు పుట్టకలు లేవో, ఏ వస్తువు అయితే ఎప్పుడూ ఉంటుందో అది నీవై ఉన్నావు. అది నీ మాటకు, మనస్సుకు అందక పోవచ్చు, అది అనుభవైక వేద్యం. ఇంతకునేను పుట్టానా, పుట్టలేదా అని అడుగుతున్నాడు. నేను దేహమును అని నీవు అనుకొంటున్నావు. దేహం పుట్టింది కాబట్టి నేను పుట్టాను అనుకొంటున్నావు. దేహమే నేను అనుకొంటున్నావు కాబట్టి దానికి సంబంధించిన గౌరవం, దానికి సంబంధించిన చావు పుట్టుకలు అదే నీవు అనుకొంటున్నావు. దేహానికి సంబంధించిన విషయాలకు, మనస్సుకు సంబంధించిన విషయాలకు అసలు వస్తువుకు ఎట్టి సంబంధము లేదు. గాఢ నిద్రలో నీవు చావు గురించి, పుట్టుక గురించి దేనిగురించి ఆలోచించవు. ఎందుచేతనంటే అక్కడ నీకు దేహానికి సంబంధించిన స్మృతిలేదు. గాఢనిద్రలో ఎవడూ నేను తెలివైన వాడిని అనుకోడు ఎందుచేతనంటే నేను తెలివైన వాడిని అనుకొనేవాడు అక్కడలేడు. నీకు ఉన్నతెలివి నిజమైతే నీ హృదయంలో ఉన్నయదార్ధ వస్తువును తెలుసుకోవటానికి ఆ తెలివి ఉపయోగపడాలి.

భగవంతుడు కర్మఫలదాత, ఈలోకాలకు ప్రభువు, ఆది లేనివాడు, కారణంలేని వాడు అని భగవంతుడు అంటే సమగ్రమైన అవగాహన ఉన్నవాడు మోహంలో నుండి విడుదల పొందుతాడు. ఈ విషయం అర్థం చేసుకోవటానికి ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లనక్కరలేదు. ఎక్కడికి వెళ్లినా అహంభావన ఉంటుంది. మీరు చెప్పేది నాకు నచ్చినా, నచ్చకపోయినా అందరికీ నచ్చుతుందా అని అడుగుతున్నాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే అందరి గొడవ నీకు ఎందుకు? ఈ ప్రశ్నలేసేది దొంగనేనే. అది అర్థంచేసుకో. నీ విషయం నీవు చూసుకో. అందరి గురించి తెలుసుకొని, నీ గురించి నీవు తెలుసుకోవటం మాని వేస్తే అది జ్ఞానమా? నీవు ఎవరో నీకు తెలియదు. అది తెలుసుకోవటానికి ప్రయత్నం చేయటం లేదు. అందరి గొడవ ఏమిటి? నిన్ను నీవు విడిచిపెట్టి లోకం గురించి తెలుసుకోవటం అది జ్ఞానమా?

---

నాన్న నాన్న రారండి
ధర్మన భాగ్యం కలిగించండి
భక్తుల కొరకు రారండీ
అజ్ఞానాన్ని తొలగించండి ॥నాన్న॥

హృదయ శక్తిని పెంచండి
అహమిక "నేను"ను తొలగించండి
పుణ్య భూమిపై అవతరించిన
ఓ ఆత్మ తేజ స్వరూపా ॥నాన్న॥

ఈశ్వ దత్తా కరుణించండి
కుమార గురువా కృప చూపండి
శ్రీరమణ దేవా దీవించండి
శ్రీ నాన్న గురువా నడిపించండి ॥నాన్న॥

"రచన" స్వరాజ్యలక్ష్మి

అజ్ఞానమా? ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో ఆనేనును వదిలేసి దానిని తొలగించుకోవటం మానివేసి ఇతరుల గురించి ఆలోచిస్తావు ఏమిటి? వారి విషయం వారు చూసుకొంటారు. నీ విషయం నీవు చూసుకో. చేతనయితే నీవు ఎవడో నీవు తెలుసుకో లేకపోతే నీవు ఎవడో మర్చిపో, దొంగనేనును మర్చిపో. రాబోయే జన్మలో ఎక్కడ పుడతాము, ఆజన్మ ఎలా ఉండాలి అనే దానిలో మనకు ఛాయస్‌లేదు. మీ ప్రారబ్దమును బట్టి ఎక్కడ పుట్టాలో భగవంతుడు నిర్ణయిస్తాడు. ఇంక చాయస్ ఎక్కడ ఉంది అంటే ఏ మాటలు మంచివి, ఏ మాటలు ప్రమాదకరం, ఏ స్నేహాలు మంచివి, ఏవి ప్రమాదకరం, ఏది విడిచిపెట్టాలి, ఏవి తీసుకోవాలి అనే దానిలో మనకు ఛాయిస్ ఉంది గాని ఎక్కడ పుట్టాలి అనేదానిలో చాయిస్ లేదు. ఇలా భగవాన్‌తో ప్రశ్నలు అడిగిన వ్యక్తి కొద్దిసేపు కూర్చొని వెళ్ళిపోయాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే ఈ సంవాదం వాడకి అర్ధం కాకపోయినా ఈ మాటలు వాడి మనస్సులో మెదులుతూ ఉంటాయి. ఏదో రోజున ఈ మాటలు వాడికి పనిచేస్తాయి. ఇప్పుడు అర్థంకాలేదు అని కంగారు పడనక్కరలేదు. ఈ మంచి మాటలు వినటంవలన ఏదోరోజు వాటిఫలితం వస్తుంది. సత్యం ఒకటి ఉందని వాడి మనస్సు అంగీకరించడంలేదు. దానిమీద వాడికి విశ్వాసం కలగటం లేదు. ఎప్పుడైతే అంగీకారం కలిగిందో అప్పుడు దానిని తెలుసుకొనే ప్రయత్నం చేస్తాడు. ఆ మంచి రోజు వస్తుంది. వాడు విన్నది కూడా బ్రహ్మమే అని తెలుసుకొనే రోజు వస్తుంది. నిన్ను విడిచిపెట్టి లోకంలో ఎన్ని తెలుసుకొన్నా అదిజ్ఞానం కాదు, అది అంతా అజ్ఞానంలో భాగమే., తలంపులలో ఏమి ఉంది అనుకోవద్దు. మంచి తలంపులు మంచి ఫలితాన్ని ఇస్తాయి, చెడు తలంపులు చెడు ఫలితాన్ని తీసుకొని వస్తాయి. అందుచేత తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. సంసారం అంటే మనుషులు కాదు, తలంపులే సంసారం. ఇవి అన్నీ మనస్సులో ఉన్నాయి. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు. మనస్సును పెంచి, పోషించేది దేహము నేనుఅనే తలంపు అదే మూలతలంపు. మూలతలంపు మూలం నీలోపలే ఉంది. అక్కడే పరమేశ్వరుడు ఉన్నాడు. మూలతలంపు మూలం తెలుసుకోవటానికి ఏ రోడ్డుమీద వెతుకుతావు, అక్కడ ఉంటే కదా వెతకటానికి, దాని మూలం నీలోపల ఉంది కాబట్టి లోపల వెతకండి. బయట విషయాలనుండి ఎక్కడ నుండి సుఖం వచ్చినా అది పరిణామంలో దు:ఖంగా మారిపోతుంది. ఆత్మలోనుండి వచ్చే సుఖాన్ని ఎంజాయ్ చెయ్యి. ఆత్మలో నీవు స్థిరపడితే నీకు నిశ్చలబుద్ధికలుగుతుంది. వాడే స్థితప్రజ్ఞుడు.



**Dearest Sri Nannagaru,**

I have no words to tell how much I appreciated your teachings today. I feel so blessed to have been able to hear them.

It feels as if they are going deep inside me and change something there; not just in my mind but in my whole understanding.

Your words (in English) are so powerful and perfect. They seem to engrave in the mind but also clarify the entire thought process.

The most important now is for me to be faithful to your words and to try and practice them in daily life (as Sadhana)

They must not remain just as a memory but must be an inspiration for my entire being during the next few weeks when you are not physically with us.

I want to tell you how grateful I feel for your kindness and how unworthy; I feel of receiving such teachings; as I sense they, come from an extremely high place; The lips of Lord Krishna Himself.

With all respect and affection,

Arunachalam
10-8-2002

**- Shanti**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 23-09-2002 | సోమవారం | జిన్నూరు, సద్గురు శ్రీ నాన్నగారి జన్మదిన మహోత్సవము, శ్రీ రమణ క్షేత్రం |
| 29-09-2002 | ఆదివారం | నర్సాపురం, వై.యన్. కాలేజ్ ఆడిటోరియం |
| 02-10-2002 | బుధవారం | గంటి, రావులపాలెం-గోపాలపురం దగ్గర |
| 06-10-2002 | ఆదివారం | గొల్లలమామిడాడ, రామాలయంలో |
| 11-10-2002 | శుక్రవారం | శృంగవృక్షం |
| 15-10-2002 | మంగళ | జిన్నూరు, శ్రీరమణక్షేత్రం |
| 20-10-2002 | ఆదివారం | అంకంపాలెం |

## సద్గురు శ్రీ నాన్నగారి 69వ జన్మదిన మహోత్సవం

| | |
|---|---|
| ఉ॥ గం॥ 6-00ల నుండి | సద్గురు దర్శనం |
| ఉ॥ గం॥ 8-00లకు | భగవాన్ పూజ శ్రీ రమణక్షేత్రంలో |
| ఉ॥ గం॥ 10-00 నుండి 12-00 వరకు | దూర ప్రాంత భక్తులకు భోజనాలు |
| మ॥ గం॥ 12-00లకు | శ్రీ నాన్నగారు ఆశ్రమంనకు రాక |
| మ॥ గం॥ 12-30లకు | శ్రీ భగవాన్ చరిత్ర తెలుగులో వీడియో ప్రదర్శన |
| మ॥ గం॥ 1-45లకు | సద్గురువుకు కమిటీ వారిచే సన్మానం |
| మ॥ గం॥ 2-00లకు | సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు |

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు ఆడియో సి.డి.లలో లభించును**

**20-09-2002**

## గ్రామాభివృద్ధికి జిన్నూరులో విశేషకృషి



పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో ప్రజల అభివృద్ధికి, వారి సంక్షేమానికి సద్గురు శ్రీ నాన్నగారు విశేషకృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా ది.17-9-2002న పెదపేటలో ఒకవీధికి జన్మభూమి నిధులు లక్షరూపాయలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్.ఎల్.ఎ. శ్రీమతి మోచెర్ల జోహార్ శంఖుస్థాపన చేశారు. పనికి ఆహార పథకంద్వారా మంజూరైన లక్షరూపాయలరోడ్డును సద్గురు శ్రీ నాన్నగారు ప్రారంభించారు. జడ్.పి. నిధులనుండి రూ.1.75 లక్షలతో చేపట్టిన మంచినీటి పైపులైను విస్తరణ పనులను జడ్.పిటి.సి. సభ్యులు శ్రీ బుంగా సారథి ప్రారంభించారు. ప్రజల భాగస్వామ్యంగా ప్రజలు చెల్లించాల్సిన రూ.15 వేల రూపాయలు సద్గురు శ్రీ నాన్నగారు చెల్లించినారు. వారి సహృదయతకు, గ్రామాభివృద్ధికి నాన్నగారు చేస్తున్న కృషికి గ్రామ ప్రజలు, అధికార్లు తమ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీమతి కలిదిండి విజయలక్ష్మీ అధ్యక్షత వహించారు.

### కూపన్

ఎడిటర్ గారికి,

నేను రమణభాస్కర సంవత్సర చందా నిమిత్తం రూ॥ 150/-లు (అక్షరాలా నూటయాబది రూపాయలు మాత్రమే) యం.ఓ. / డి.డి. / నగదు పంపించుచున్నాను. క్రమం తప్పకుండా ప్రతులు పంపించగలరు. (ది. 23-9-2002 నుండి 22-9-2003) వరకు.

పేరు ..............................................................................

తండ్రి / భర్త ..............................................................................

డోర్ నెం. ............................................ వీధి / రోడ్ పేరు ............................................

గ్రామం ............................................................ పిన్ కోడ్ ..............................

మండలం ............................................................ జిల్లా ............................................

డి.డి. / యమ్.ఓ./నగదు వివరాలు ............................................ ఫోన్ నెం. ..............................

**రమణ భాస్కర**